క్లుప్తంగా

గురుపౌర్ణమి వేడుకలకు సిద్ధం

మునగపాక: మండల వ్యాప్తంగా గురువారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. సాయిబాబా ఆలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగేలా చర్యలు తీసుకున్నారు. మునగపాక షిర్డీసాయి బాబా ఆలయంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న సప్తాహం గురువారంతో ముగియనుంది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ బొడ్డేడ వీరేంద్ర తెలిపారు.

ఆరు గ్రావెల్ ట్రాక్టర్ల పట్టివేత

నక్కపల్లి : నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి అనుమతులు లేకుండా గ్రావెల్ తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లని పోలీసులు పట్టుకున్నారు. సీఐ కుమార్‌స్వామి తెలిపిన వివరాల ప్రకారం జానకయ్యపేట నుంచి అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న ట్రాక్టర్లను హెటిరో కంపెనీకి వెళ్లే రోడ్డులో పట్టుకుని, పోలీసులు అదుపులో ఉంచడం జరిగిందన్నారు. తగు చర్యలు కోసం తహసీల్దార్‌కు వద్దకు పంపించామన్నారు. ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో కొంతమంది గ్రావెల్ మాఫియా కూటమి ప్రభుత్వం అండతో యధేచ్ఛగా గ్రావెల్ తవ్వి కంపెనీలకి విక్రయిస్తున్నారు. టీడీపీ నాయకుల్లో తగాదాల కారణంగా ఒకరికొకరు ఫిర్యాదు చేసుకుంటున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వుతున్నా వారిపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

భజన మండలి కార్యదర్శిగా చెల్లయ్యనాయుడు

మునగపాక: మండలంలోని మూలపేటకు చెందిన బొడ్డేడ చెల్లయ్యనాయుడు విశ్వహిందూ మహాసంఘ్ భారత్ జిల్లా భజన మండలి కార్యదర్శిగా నియమితుడయ్యారు. ఈ మేరకు బుధవారం ఆయనకు నియామక పత్రం అందజేశారు. తోటాడ పంచాయతీ ఉప సర్పంచ్‌గా పనిచేసిన చెల్లయ్యనాయుడుకు కార్యవర్గంలో చోటు కల్పించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చెల్లయ్యనాయుడు మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

మునగపాక: మండలంలోని చూచుకొండ షిర్డీసాయిబాబా ఆలయ ప్రాంగణంలో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. జిల్లా అంధత్వ నివారణ సంస్థ అనకాపల్లి సౌజన్యంతో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరానికి 106 మంది రోగులు హాజరు కాగా.. వారిలో 20 మందికి శస్త్రచికిత్సలు చేసేందుకు నిర్ణయించారు. శంకర్ ఫౌండేషన్ నేత్ర వైద్యురాలు దుర్గాభవానీ వైద్య సేవలందించారు. ఫౌండేషన్ క్యాంప్ కో-ఆర్డినేటర్ అశ్వని కుమార్, క్యాంప్ మేనేజర్ ఎం.అరుణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

యలమంచిలి మార్కెట్ కమిటీ నియామకం

యలమంచిలి రూరల్:యలమంచిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఖరారు చేస్తూ ప్రభుత్వ ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.రాజశేఖర్ బుధవారం జీవో జారీ చేశారు.చైర్‌పర్సన్‌గా అచ్యుతాపురం మడుతూరుకు చెందిన తట్టా లోవకుమారి,వైస్ చైర్మన్ యలమంచిలి మున్సిపాలిటీ రామారాయుడుపాలెంకు చెందిన గొర్లె వీర భద్రరావులతో పాటు 19 మంది సభ్యులతో కూడిన పాలకవర్గాన్ని నియమించారు.ఈ కమిటీకి గౌరవ అధ్యక్షుడిగా స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ వ్యవహరించనున్నారు.యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారికి కూడా కమిటీలో సభ్యురాలిగా చోటు కల్పించారు. ఈ కమిటీ సంవత్సరం పాటు కొనసాగుతుందని పేర్కొన్నారు.

ఘనంగా 'బొత్స' జన్మదిన వేడుకలు



బొత్స సత్యనారాయణ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న ఎంపీపీ గోవింద్ తదితరులు

యలమంచిలి రూరల్: శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ జన్మదిన వేడుకలను ఎంపీపీ బోదెపు గోవింద్ ఆధ్వర్యంలో బుధవారం యలమంచిలి ఎంపీపీ చాంబర్‌లో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి బొత్సకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరరావు, అర్రెపు గుప్తా, కౌన్సిలర్లు కొఠారు కొండబాబు, దాసరి కుమార్, పిళ్లా త్రినాథ్, పిట్టా సత్తిబాబు, రాపేటి సంతోష్, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, సర్పంచ్ మర్రి రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సాగుపై రైతులకు అవగాహన

పాయకరావుపేట: మండలంలో గల ఈదటం, పాల్మన్‌పేట గ్రామాల్లో వ్యవసాయ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి పి.ఆదినారాయణ మాట్లాడుతూ ఖరీఫ్ వరి నారుమడి యాజమాన్యం, పంట నమోదుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వీహెచ్ఏలు ప్రియాంక, గోపీకృష్ణ, గ్రామపెద్దలు, రైతులు పాల్గొన్నారు.

రక్షణ లేని.. తుపాను రక్షిత భవనాలు



పెద్దూరు రత్నయ్యమ్మపేటలో పాఠశాల ఆవరణలో శిథిలమైన తుపాను షెల్టరు భవనం

- పూర్తిగా శిథిలమై కూలిపోవడానికి సిద్ధంగా పురాతన కట్టడాలు
- అయినా పట్టించుకోని అధికారులు
- పాఠశాలల ఆవరణలో ఉండటంతో భయం భయం



వెంకటనగరంలో పాఠశాల ఆవరణలో శిథిలమైన తుపాను షెల్టరు భవనం



రాజానగరంలో పాఠశాల ఆవరణలో శిథిలమైన తుపాను షెల్టరు భవనం

పాయకరావుపేట: మండలంలోని తీర ప్రాంత మత్స్యకార గ్రామాల్లో రక్షిత తుపాను భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇవి స్థానిక మత్స్యకారులకు ఏ విధంగాను ఉపయోగపడడంలేదు. అవి ఎప్పుడు కుప్పకూలుతాయో అని గ్రామస్తులు భయపడుతున్నారు. ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాలకు చెందిన మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని వెంకటనగరంలో నిరుపయోగంగా ఉన్న తుపాను భవనం శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలుతుందోనన్న భయంగా ఉందని ప్రజలు వాపోతున్నారు. ఇది పాఠశాల ఆవరణలో ఉండడం వల్ల మరింత ఆందోళన కలుగుతోంది. విద్యార్థులు తుపాను భవనానికి సమీపంలోనే సంచరించడం వల్ల ఎప్పుడేమవుతుందో అని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడి పాఠశాలలో 80 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాలకు ఆనుకుని తుపాను భవనం ఉండడం వల్ల సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

రాజానగరంలో కూడా..

అదే విధంగా రాజానగరంలో కూడా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోని తుపాను రక్షిత భవనం ఎంతో కాలంగా నిరుపయోగంగా ఉంది. ఇది కూడా శిథిలావస్థకు చేరుకుంది. ఇక్కడి పాఠశాలలో వందలాది మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.

పెద్దూరు రత్నయ్యమ్మపేటలో..

పెద్దూరు రత్నయ్యమ్మపేటలో కూడా శిథిలావస్థకు చేరుకున్న రక్షిత తుపాను భవనం పాఠశాలను ఆనుకుని ఉంది. పాఠశాలకు, తుపాను షెల్టరుకు మధ్య నుండే విద్యార్థులు సంచరించడం వల్ల ఎప్పుడు ఏం జరుగుతుందో అని అంతా ఆందోళన చెందుతున్నారు. 58 మంది విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారు.

రాజయ్యపేట గ్రామంలో..

రాజయ్యపేట గ్రామంలో కూడా తుపాను రక్షిత భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఈ భవనం కూడా పాఠశాల ఆవరణలోనే ఉండడంతో అంతా భయపడుతున్నారు. ఈ భవనం శిథిలమై పెద్ద పెద్ద పెచ్చులు ఊడి పడిపోతున్నాయి. ఏ సమయంలో భవనం కూలుతుందో అని ప్రజలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు దిగులు చెందుతున్నారు. మండల విద్యాశాఖ అధికారిని ఈ విషయమై సంప్రదించగా ఎన్నోసార్లు ఉన్నతాధికారులకు రిపోర్టు చేశామని, కానీ ఇంత వరకు ఏ విధమైన ఆదేశాలు తమకు రాలేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి పూర్తిగా శిథిలమై, కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న తుపాను రక్షిత భవనాలను తొలగించాలని పలువురు మత్స్యకారులు కోరుతున్నారు.

ఎప్పుడు కూలుతుందో అని భయంగా ఉంది..



గ్రామంలో తుపాను రక్షిత భవనం శిథిలావస్థకు చేరుకుంది, ఎప్పుడు కూలుతుందో అని భయంగా ఉంది. పాఠశాల ఆవరణలో ఉండడం వల్ల విద్యార్థులు సంచరిస్తుంటారు. అధికారులు స్పందించి శిథిలమైన భవనాన్ని తొలగించాలని కోరుతున్నాం.

– చోడిపల్లి శ్రీనివాసరావు, మత్స్యకారుడు, వెంకటనగరం

శిథిల భవనాన్ని తొలగించాలి..



పెద్దూరు రత్నయ్యమ్మ పేట గ్రామంలో పాఠశాల ఆవరణలోనే శిథిలమైన భవనం ఉంది. విద్యార్థులు ఇక్కడే సంచరిస్తున్నారు. దీంతో భయంగా ఉంటుంది. అధికారులు చర్యలు తీసుకుని భవనాన్ని తొలగించాలని కోరుతున్నాం.

– నీలాపు వెంకటరెడ్డి, కుమారపురం

పంచాయతీ అభివృద్ధి సూచికపై శిక్షణ

కోటవురట్ల: పంచాయతీ అభివృద్ధి సూచికపై మండల స్థాయి అధికారులకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో పంచాయతీ అభివృద్ధికి అనుసరించాల్సిన పలు అంశాలపై ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. ఎంపీడీవో చంద్రశేఖర్ మాట్లాడుతూ అభివృద్ధి లక్ష్యాలను సాధించే దిశగా పురోగతిపై ప్రణాళిక వేసుకోవాలన్నారు. పేదరికం తగ్గింపు, పారిశుధ్యం, ఆరోగ్యం, సుపరిపాలన వంటి అంశాలను పీఏఐ ద్వారా నమోదు చేస్తారన్నారు. ఈవోపీఆర్డీ రఘురాం, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెనుగొల్లు పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా పవన్‌కుమార్

ఎస్.రాయవరం: పెనుగొల్లు పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా ఎంపికైన రెడ్డి పవన్‌కుమార్‌ను స్థానిక రైతులు జ్యోతికుమార్ తదితరులు బుధవారం అభినందించారు. పీఏసీఎస్ బాధ్యతలు రైతు కుటుంబానికి చెందిన వ్యక్తికి అప్పగించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. యువ రైతులు మాలెం రాజు, మడగల రాజు, దాసరి ప్రసాద్, తేటకాయల అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని పరిశీలించిన సంస్థ కార్యదర్శి

పాయకరావుపేట: పట్టణంలో గల వైఎస్సార్ శాఖా గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రు కుమార్‌రాజా బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, పుస్తకాలను పరిశీలించారు. గ్రంథాలయం పరిసరాల పరిశుభ్రత, పాఠకుల హాజరు, తదితర అంశాలను గ్రంథాలయ అధికారి వామాల లక్ష్మణరావును అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు యలమంచిలి గ్రంథాలయాధికారి వి.ఆనంద్ ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకులకు నేతల పరామర్శ



త్రిపర్ణ శ్రీనును పరామర్శిస్తున్న కంబాల, చిక్కాల



డాక్టర్ ఉపమాహేశ్వరరావును పరామర్శిస్తున్న కంబాల, చిక్కాల

పాయకరావుపేట: వైఎస్సార్ సీపీ నాయకులను బుధవారం నియోజకవర్గ సమన్వయ కర్త, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు పరామర్శించారు. మండలంలో గల పెదరాంభద్రపురం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ త్రిపర్ణ శ్రీను ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. వీరిని కంబాల జోగులు, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు పరామర్శించారు. అదే విధంగా పట్టణంలో గల సీనియర్ నాయకుడు, ఆర్ఎంపీ డాక్టర్ ఉమా మహేశ్వరరావు కూడా అనారోగ్యం కారణంగా ఇంటి వద్దనే విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈయన్ని కూడా కంబాల జోగులు, చిక్కాల రామారావు పరామర్శించారు. వీరితో పాటు జెడ్పీటీసీ సభ్యుడు లంక సూరిబాబు, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, జిల్లా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబా, ఉప సర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ధనిశెట్టి మహేష్, సర్పంచ్‌లు పన్నీరు పాపారావు, కోడ కోటేశ్వరరావు, గెడ్డమూరి నీలవేణి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాలరాముడికి ప్రత్యేక పూజలు



బాలరాముడిని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక: మునగపాక అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం ఏర్పాటు చేసిన బాలరాముడి విగ్రహానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి పూజలు చేశారు. అయోధ్యలో ప్రతిష్ట కానున్న ఈ విగ్రహాన్ని భక్తుల సందర్శనార్థం తీసుకొచ్చారు. ఈ సందర్భంగా అయోధ్య బాలరామ ట్రస్ట్ చైర్మన్ చల్లా శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తి భావాలను అలవరుచుకోవాలన్నారు. రాముడిని పూజించడం ద్వారా అందరికీ మంచి చేకూరుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వేగి లక్ష్మణరావు, కమిటీ సభ్యులు ఆడారి అచ్చియ్యనాయుడు, కాండ్రేగుల జగ్గారావు, పెంటకోట ఉమేష్, మొల్లేటి సత్యనారాయణ, ఆడారి కాశీబాబు, కాండ్రేగుల పరదేశిరావు, జల్లేపల్లి కిష్టప్ప, పెంటకోట శ్రీనివాసరావు, పొన్నా కిరణ్, సత్యనారాయణ, దాడి ముసిలినాయుడు, ఆడారి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు




బదిలీపై వెళ్తున్న సచివాలయ ఉద్యోగులను సత్కరిస్తున్న వాడ్రాపల్లి సర్పంచ్ నూకరాజు

మునగపాక: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు సమాజంలో తగిన గుర్తింపు ఉంటుందని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు అన్నారు. వాడ్రాపల్లి సచివాలయంలో విధులు నిర్వహిస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన ఉద్యోగులను బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ అందరి అభిమానాలు చూరగొన్న సచివాలయ ఉద్యోగులు రానున్న రోజుల్లో ఉన్నత పోస్టుల్లో గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో మళ్ల వరహా నరసింగరావు, మళ్ల శేషు, కన్నునాయుడు, లక్ష్మణరావు, మల్లయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మట్టి తవ్వకాలపై ఫిర్యాదు

ఎస్.రాయవరం: మండల టీడీపీ అధ్యక్షుడు అమలకంటి అబద్ధం చెరువుల్లో మట్టి తరలించుకుపోయి అమ్ముకుంటున్నారని ఆదే పార్టీకి చెందిన సోమిరెడ్డి రాజు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. బుధవారం వాకపాడు చెరువులో మట్టిని పెద్ద ఎత్తున ఎస్.రాయవరం, ఉప్పరాపల్లి, వాకపాడు తదితర గ్రామాల ఇళ్ల నిర్మాణదారులకు తరలించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. 8 ట్రాక్టర్లకు మట్టిని తరలించేందుకు అనుమతులు తీసుకుని 10 ట్రాక్టర్ల మట్టిని విక్రయించుకున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు తహసీల్దార్ రమేష్‌బాబుని వివరణ కోరగా జిరాయితీ భూమిలో మట్టిని తరలించేందుకు బుధవారం ఉదయం నుంచి అనుమతులు ఇచ్చామన్నారు. అనుమతులు అతిక్రమించి మట్టి తరలించినట్టయితే చర్యలు తీసుకుంటామన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు



అడ్డురోడ్డులో సర్కిల్ స్టేషన్‌కు ముస్తాబు పనులు చేయిస్తున్న సీఐ తదితరులు

ఎస్.రాయవరం: జాతీయ రహదారిపై మరింత భద్రత పెంచేందుకు నక్కపల్లి సర్కిల్ పరిధిలో 100 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్టు సీఐ కుమారస్వామి తెలిపారు. గురువారం హోం మంత్రి వాటిని ప్రారంభిస్తారన్నారు. అడ్డురోడ్డు నుంచి పాయకరావుపేట వరకు అవసరమైన ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని అడ్డురోడ్డులో ఉన్న నక్కపల్లి సర్కిల్ పోలీస్ స్టేషన్‌ను అందంగా ముస్తాబు చేశారు.

గ్రామ పంచాయతీల అభివృద్ధిపై దృష్టి సారించండి

పాయకరావుపేట: గ్రామ పంచాయితీల అభివృద్ధిపై సచివాలయ సిబ్బంది దృష్టి సారించాలని ఎంపీడీవో జయప్రకాష్‌రావు అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులతో సమావేశమయ్యారు. గ్రామాల్లో పారిశుధ్య లోపం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలం కనుక చెత్త కుప్పలు లేకుండా చూడాలన్నారు. మురుగు నీరు నిల్వ లేకుండా శుభ్రం చేయాలన్నారు. ఈ సమావేశంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, కార్యదర్శి వై.వి. సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

యలమంచిలి రూరల్: స్థానిక 33/11కేవీ విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో జంగిల్ క్లియరెన్స్, ఆర్‌డీఎస్ఎస్ పనుల నిమిత్తం ఈ నెల 11న విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్(ఆపరేషన్స్) అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. మిలట్రీ కాలనీ, కొత్తపేట, యానాద్రి కాలనీ, రైల్వే స్టేషన్ రోడ్డు, మెయిన్ రోడ్డు, ద్వారకానగర్, నెహ్రూ నగర్, గాంధీనగర్, తులసీనగర్, ఎన్‌టీఆర్ కాలనీ, ఫైర్ ఆఫీస్ కాలనీ, ధర్మవరం ప్రాంతాలు, యర్రవరం, కొత్త యర్రవరం, సోమలింగపాలెం, లైను కొత్తూరు, సోమలింగపాలెం, కట్టుపాలెం, రామారాయుడుపాలెం, కొత్తపాలెం గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

'అన్నదాత సుఖీభవ' నమోదుకు నేడే ఆఖరు



మల్లవరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న సహాయ సంచాలకుడు సుబ్రహ్మణ్యం

మునగపాక: అన్నదాత సుఖీభవ పథకం కోసం ఈ నెల 10లోగా అధికారులకు వివరాలు అందజేయాలని అనకాపల్లి వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సీహెచ్ సుబ్రహ్మణ్యం తెలిపారు. మండలంలోని నాగవరం, మల్లవరం గ్రామాల్లో జరుగుతున్న పొలం పిలుస్తోంది కార్యక్రమ పనితీరును బుధవారం ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకానికి సంబంధించి గురువారంతో ఆఖరి గడువుగా నిర్ణయించిందన్నారు. రైతులు ఆయా రైతు సేవా కేంద్రాల వద్దకు వెళ్లి పత్రాలు అందించాలన్నారు. ఆధార్ లింక్ తప్పనిసరిగా పేర్కొన్నారు. వరికి సంబంధించి కొత్త రకం విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. శాస్త్రవేత్త భవాని మాట్లాడుతూ వరిలో రెల్లరాల్చు పురుగు ఆశిస్తోందని, దీని నివారణ కోసం దుక్కులు, దమ్ములు బాగా చేసుకోవాలన్నారు. వరిలో విత్తన శుద్ధిపై దృష్టి సారించాలన్నారు. మండల వ్యవసాయాధికారి జ్యోత్స్న కుమారి మాట్లాడుతూ సీజన్‌కు అవసరమయ్యే ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక రైతులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో కార్మికులకు అన్యాయం



మునగపాక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు



మునగపాక మెయిన్ రోడ్డు వద్ద మానవహారంలో మాట్లాడుతున్న సీఐటీయూ నేతలు



యలమంచిలిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న కార్మికులు

మునగపాక: కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు ఈశ్వరరావు డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా చేపట్టిన దేశవ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం మునగపాకలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్ కారణంగా కార్పొరేట్ సంస్థలకు మేలు జరుగుతోందన్నారు. కార్మిక వర్గాలకు గుదిబండగా మారుతున్నాయన్నారు. కార్మికుల పని సమయాలను కూడా పెంచేయడం విచారకరమన్నారు. కంపెనీల్లో పనిచేసే మహిళా కార్మికులకు భద్రత లేకుండా పోతోందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్.బ్రహ్మాజీ, జిల్లా ఆశ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి పార్వతి, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు టెక్కలి జగ్గారావు, సంజీవరావు, వీవోఏ సంఘ నాయకులు ప్రకాష్, అంగన్‌వాడీ కార్యకర్తలు రామలక్ష్మి, జయలక్ష్మి, హేమలత, సరస్వతి, జయ, పద్మ పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

యలమంచిలి రూరల్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లు రద్దు చేసి, కార్మిక చట్టాలను కాపాడాలని డిమాండ్ చేస్తూ బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మిక సంఘాలు ఆందోళన చేపట్టాయి. యలమంచిలి ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి దిమిలి రోడ్డు జంక్షన్ వరకూ ర్యాలీ, అక్కడ మానవహారం చేపట్టారు. సీఐటీయూ మండల కార్యదర్శి చింతకాయల శివాజీ, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో పారిశ్రామిక వేత్తలకు ప్రయోజనం చేకూర్చేలా చట్టాలు తీసుకురావడం దుర్మార్గమన్నారు. గత ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే ఈ సమస్యలను పరిష్కరిస్తామని స్కీమ్ వర్కర్లు, ఎండీఎం కార్మికులకు నారా లోకేష్ మాట ఇచ్చారని, ఇప్పుడా విషయాన్ని గాలికొదిలేశారని విమర్శించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ జిల్లా కార్యదర్శి శివరామకృష్ణ, అంగన్‌వాడీ సెక్టార్ లీడర్ శశి, నూకరత్నం, జానకి, నగిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలి

యలమంచిలి రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని డిమాండ్ చేస్తూ బుధవారం యలమంచిలిలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ ఒప్పంద, పొరుగు సేవలు, ముఠా, మోటారు, భవన నిర్మాణ కార్మికులు ఆందోళన చేపట్టారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా పట్టణంలోని కార్మికులంతా తమకు నెలకు రూ.26,000 కనీస వేతనం ఇవ్వాలని, కొత్త లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర సమితి అధ్యక్షుడు గనిశెట్టి ఏసుదాసు, కార్మిక సంఘాల నాయకులు వై.నూకరాజు, సిహెచ్.వెంకటరమణ, డి.మహేష్, సూరిబాబు, పవన్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కార్పొరేట్ల సేవలో తరిస్తున్న కేంద్ర ప్రభుత్వం

నక్కపల్లి: కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బుధవారం నక్కపల్లిలో పలు కార్మిక సంఘాలు, వామపక్ష నాయకుల ఆధ్వర్యంలో భారత్ బంద్ విజయవంతమయింది. సీఐటీయూ, అంగన్‌వాడీ, ఆశ, వివిధ ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేసే కార్మికులు నక్కపల్లి నూకాలమ్మ గుడి నుంచి జాతీయ రహదారి మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు, కార్మికుడికి సంకెళ్లు వేసి రిక్షాలో ఊరేగించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు ఎం. అప్పలరాజు తదితరులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అదానీ, అంబానీల సేవలో తరిస్తున్నాయన్నారు. లేబర్ కోడ్‌లను మార్చేసి కార్మికులను కట్టుబానిసలుగా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. సీపీఎం మండల కన్వీనర్ ఎం. రాజేష్, సీఐటీయూ నాయకులు మహేష్‌బాబు, సూర్యనారాయణ, నారాయణరావు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు దుర్గారాణి, లక్ష్మీరాజ్యం, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.


లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని ఆందోళన

కోటవురట్ల: లేబర్ కోడ్‌లు రద్దు చేసి కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మండలంలో భారత్ బంద్‌లో భాగంగా సీఐటీయూ నాయకులు బుధవారం ఆందోళన నిర్వహించారు. ప్రధాన కూడలిలో ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. స్కీం వర్కర్లు, అసంఘటిత రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి కార్మికులకు కనీస వేతనంగా రూ.26 వేలు ఇవ్వాలన్నారు.

బంగారమ్మపాలెంలో..

ఎస్.రాయవరం: దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మండలంలో బంగారమ్మపాలెంలో కార్మికులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వీవోఏ జిల్లా అధ్యక్షులు రూపాదేవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకు స్కీమ్ వర్కర్లు పోరాడాలని అన్నారు. జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ, వెలుగు, ఎన్ఆర్‌జీఎస్ కార్మికులు తదిరులు పాల్గొన్నారు.


పశుపోషణలో జాగ్రత్తలు తప్పనిసరి




బి.కె.పల్లిలో పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్న పశు వైద్యాధికారి హరిప్రియ

కోటవురట్ల: పాడి పశువుల పోషణలో రైతులు జాగ్రత్తలు పాటించాలని పశు వైద్యాధికారి డాక్టర్ హరిప్రియ సూచించారు. బి.కె.పల్లిలో పశుగ్రాస వారోత్సవాలలో భాగంగా పాడి రైతులకు అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. పశుగ్రాసాలుగా మొక్కజొన్న, జొన్న రకాలు మంచి ఫలితాలు ఇస్తాయని, అధిక పాల ఉత్పత్తి అవుతుందన్నారు. సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండడంతో పాటు మేలైన పశుగ్రాసాలను పండించాలన్నారు. సర్పంచ్ పెట్ల లింగన్ననాయుడు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

తోటాడ, వాడ్రాపల్లిలో ఘనంగా గిరి ప్రదక్షిణ



తోటాడలో గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు



వాడ్రాపల్లిలో వేంకటేశ్వర స్వామిని ఊరేగిస్తున్న భక్తులు

మునగపాక: మండలంలోని తోటాడ, వాడ్రాపల్లి గ్రామాల్లో బుధవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు గిరి ప్రదక్షిణ ఘనంగా నిర్వహించారు. తోటాడలోని ఆదినారాయణ స్వామి రాజయోగాశ్రమం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఓం కార పీఠం నుంచి ప్రారంభమైన ప్రదక్షిణ త్రిమూర్తుల ఆలయం, పాటిపల్లి కాలనీ, కాకరాపల్లి, నారాయుడుపాలెం మీదుగా పీఠం వద్దకు తిరిగి చేరింది. మేనేజింగ్ ట్రస్టీ సుసుమ్న కుమార్ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు. గురువారం ఓం కార పీఠం ఆవరణలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించేలా చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

- వాడ్రాపల్లిలో గిరి ప్రదక్షిణ ఘనంగా జరిగింది. గతేడాది నుంచి ఈ గ్రామంలో గిరి ప్రదక్షిణను పెద్దలు ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కలియుగ దైవం వేంకటేశ్వర స్వామిని భక్తులు పల్లకీలో ఊరేగించారు. గిరి ప్రదక్షిణలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.